

ప్రమాదాలను నివారించాలి

సింహపురి పౌర సమాఖ్య

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు
రూరల్ ప్రాంతంలోని 21వ డివిజన్, కొండాయపాలెం గేట్ వద్ద రైల్వే 3వ లైన్ పనులు చేపడుతున్న కారణంగా అటుగా వెళ్లే పాదచారులు, వాహన దారులను ప్రమా దాలకు గురౌతున్నారని, ఈ నేపథ్యంలో పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రమాదాలను నివారించాలని జిల్లా సింహపురి పౌర సమాఖ్య కోరింది. ఈ మేరకు గురువారం ఆ సమాఖ్య ఆధ్వర్యంలో కొండాయ పాళెం రైల్వే గేట్ ప్రాంతం వద్ద విధులు నిర్వహిస్తున్న గెట్ మెన్ వద్ద ఫిర్యాదులు పుస్తకంలో రైల్వే సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్‌కు సమస్యను వివరిస్తూ జిల్లా సింహపురి పౌర సమాఖ్య నాయకులు నమోదు చేశారు. ఈ సమస్య పై అధికారుల దష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ. డ్యూటీలో ఉన్న గేట్ మ్యాన్ కు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా సింహపురి పౌర సమైక్య జిల్లా కన్వీనర్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. నిత్యం రద్దీగా ఉన్నటువంటి కొండపాలెం గేటు వద్ద మూడవ లైన్ ప్రారంభ పనులు జరుగుతున్న సందర్భంలో పాదచారులు, వాహనదారులు, అతి దగ్గరలో ఉన్నటువంటి ప్రభుత్వ ప్రధాన వైద్యశాల (జిజిహెచ్)కు చికిత్సలకు వెళ్లే పేషెంట్లు అనేక ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. త్వరత గ తిన గేట్ వద్ద పనులను పూర్తి చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు. షార్ రిటైర్డ్ ఎంప్లాయ్ సుధాకర్ , సింహపురి పౌర సమాఖ్య రూరల్ కన్వీనర్ కిన్నెర కుమార్ , 21 డివిజన్ నాయకులు, రవీంద్ర, మనీ, గురవయ్య, మురళి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎంఎల్‌సి కౌంటింగ్‌లో..

పిడిఎఫ్, వైసిపి పోటాపోటీ..!

- ❍పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి 1769 ఓట్ల లీడింగ్
- ❍చెల్లని ఓట్ల విషయంలో వైసిపి, టిడిపి మధ్య వివాదం
- ❍రిటర్నింగ్ అధికారి హరినారాయణ జోక్యంతో ప్రశాంతం
- ❍'ఫలితాలు' అర్ధరాత్రి తరువాతే...

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో
తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గం ఫలితాల్లో వైసిపి, పిడిఎఫ్ అభ్యర్థుల మధ్య పోటాపోటీ నెలకొంది. ప్రతి రౌండ్‌లోనూ నరాలు తెగేంత ఉత్కంఠ నెలకొంది. వైసిపి అభ్యర్థి పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి స్వల్ప మెజార్టీతో బయట పడుతూ వచ్చారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ చిత్తూరు – తిరుపతి రహదారిలోని ఆర్‌విఎస్ లా కళాశాలలో గురువారం ఉదయం 8 గంటలకు రిటర్నింగ్ అధికారి హరినారాయణ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాజశేఖర్ సమయంలో ప్రారంభమయ్యింది. మొత్తం 24,714 ఓట్లు పోలయ్యాయి. 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక రౌండ్‌కు ఏడువేల చొప్పున మూడు రౌండ్లను లెక్కించారు. 465 ఓట్లు చెల్లకుండా పోయాయి. మూడున్నర రౌండ్లకు గాను వైసిపి అభ్యర్థికి 10,372 ఓట్లు రాగా, పీడీఎఫ్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డికి 8,603 ఓట్లు వచ్చాయి. టిడిపి మద్దతు ఇచ్చిన ఎపిటిఎఫ్ అభ్యర్థి ఎలొసి రమణారెడ్డికి 2286 ఓట్లు వచ్చాయి. వైసిపి అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డికి మ్యాజిక్ ఫిగర్ 12,500 ఓట్లు రావాల్సి ఉంది. దీంతో 'రెండో ప్రాధాన్యత' ఓటు అవసరమయ్యింది.

కౌంటింగ్‌లో నిమగ్నమైన అధికారులు

వైసిపి, పీడీఎఫ్ మధ్య వివాదం
వైసిపి అభ్యర్థికి 2,128 ఓట్లు కావాల్సి ఉంది. చెల్లని ఓట్లనూ పరిగణనలోకి తీసుకుని, తరువాత రెండో ప్రాధాన్యతకు వెళ్లాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాజశేఖర్ సూచించారు. అయితే పీడీఎఫ్ అభ్యర్థులు మొదటే చెప్పకుండా, మధ్యలో చెప్పడం ఏంటని వాగ్వివాదానికి దిగారు. ఎన్నికల అధికారి హరినారాయణ జోక్యం చేసుకుని పారదర్శకంగా కౌంటింగ్ జరిపిస్తామని, విశాఖలోనూ, పశ్చిమ రాయలసీమలోనూ ఇలానే జరిగిందని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఒకటికి రౌండ్ వేసి టిక్ కొట్టి ఉంటే ఆ ఓటు చెల్లుతుందని, ఒకటి వేసి టిక్ కొడితే చెల్లనిదిగా చూడాలని, ఓటర్లను గౌరవించాలని సూచించారు. ఇరు గ్రూపులు అంగీకరించాయి. చెల్లని ఓట్లను పరిగణనలోకి తీసుకుని లెక్కించారు. 637గా ఉన్న చెల్లని ఓట్లు ఉన్నాయి. పరిగణనలోకి తీసుకున్న లెక్కల తరువాత 465గా చెల్లలేదని తేల్చారు. 88 వైసిపి అభ్యర్థికి, 60 పిడీఎఫ్‌కు, 24కు ఎపిటిఎఫ్‌కు కలిపారు. వైసిపికి 10,372, పీడీఎఫ్‌కు 8,603, ఎపిటిఎఫ్‌కు 2,286 ఓట్లుగా కలిసొచ్చాయి. పీడీఎఫ్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిపై వైసిపి అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి 1769 ఓట్ల మెజార్టీతో 'మొదటి' ప్రాధాన్యతలో లీడ్‌గా నిలిచారు. రెండో ప్రాధాన్యత లెక్కింపు కార్యక్రమం రాత్రి 9.30 గంటలకు ప్రారంభమయ్యింది. అర్ధరాత్రి పైనే ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

ఉపాధ్యాయ కౌంటింగ్‌లో రౌండ్ల వారీగా వచ్చిన ఓట్లు

మొదటి రౌండ్	
వైసిపి	3079
పీడీఎఫ్	2522
ఎపిటిఎఫ్	847
లీడ్	557 (వైసిపి)
రెండో రౌండ్	
వైసిపి	2964
పీడీఎఫ్	2560
ఎపిటిఎఫ్ 933	
లీడ్	404 (వైసిపి)
మూడో రౌండ్	
వైసిపి	3,008
పీడీఎఫ్	2,481
ఎపిటిఎఫ్ 66	
లీడ్	521 (వైసిపి
నాలుగో రౌండ్	
వైసిపి	1233
పీడీఎఫ్	980
ఎపిటిఎఫ్	416
లీడ్	252 (వైసిపి)

పెన్నా బ్యారేజీకి 'నల్లపరెడ్డి' బ్యారేజీగా నామకరణం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి-నెల్లూరు :నెల్లూరు పెన్నా బ్యారేజీకి జిల్లాకు చెందిన మాజీ మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి బ్యారేజీగా నామకరణం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వ్యూలు జారీ చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గత ఏడాది జిల్లాలో పర్యటించిన సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు కాకాని గోవర్ధన్ రెడ్డి, కోవూరు శాసనసభ్యులు నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి నెల్లూరు బ్యారేజీ కి జిల్లాకు ఎనలేని సేవలు చేసిన మాజీ మంత్రి నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి బ్యారేజీగా నామకరణం చేయాలని విజ్ఞప్తి చేశారు.అప్పుడు సిఎం ప్రకటించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రతిపాదనలు పంపిగా నెల్లూరు బ్యారేజి పేరును నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి బ్యారేజీగా మార్పు చేసి నోటిఫై చేస్తూ జిఒ నెంబర్ 29తో గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు పెన్నా బ్యారేజీ పేరు మార్పు గురించి వచ్చే ఆంధ్రప్రదేశ్ గెజిట్ సంచికలో ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.

సమీక్షిస్తున్న కమిషనర్

వీధి కుక్కల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు :నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజనుల్లో వీధి కుక్కల నియంత్రణకై జంతు సంరక్షణ చట్టాలను అనుసరించి తగిన పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కమిషనర్ హరిత ఆదేశించారు. గురు వారం కార్పోరేషన్ కార్యాలయంలో కమిషనర్ ఛాంబర్ లో ఆరోగ్య శాఖాధికారి, వెటర్నరీ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల వారీగా వీధి కుక్కల గణాంకాలను సేకరించి నివేదిక ఇవ్వాలని సూచించారు. శస్త్ర చికిత్సలు చేసిన కుక్కలకు ఇన్ఫెక్షన్ సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జంతు సంరక్షురాలు ఉమాదేవి పాల్గొన్నారు.

24న టిడిపిలోకి 'కోటంరెడ్డి'..!

మంగళగిరి ఆఫీసులో చంద్రబాబు సమక్షంలో చేరిక

కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి
నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సొదరుడు, వైసిపి కార్యాలయ ఇన్‌ఛార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి టిడిపిలో చేరనున్నారు. కొద్ది రోజులుగా వైసిపితో విభేదించిన ఆయనను ఇటీవల రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు పోస్టు నుంచి బహిష్కరిం చారు. ఈ నేపథ్యంలో ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం 2.14 నిమిషాలకు మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకోనున్నారు. టిడిపి రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది. మేయర్ భర్త జయవర్ధన్, మాజీ కార్పోరేటర్, వైసిపి నగర అధ్యక్షులు తాటి వెంకటేశ్వర్లు తోపాటు పలువురు నేతలు ఆయన వెంట టిడిపిలో చేరడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. నెల్లూరు నుంచి భారీగా కార్య కర్తలు, వాహనాలుల్లో తరలివెళ్ల డానికి సిద్ధమవుతున్నారు. అక్టోబర్‌లో ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేయర్ స్రవంతితోపాటు కార్పొరేటర్లు టిడిపిలో చేరడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

వైసిపి నగర అధ్యక్షులు వెంకటేశ్వర్లు రాజీనామా

ప్రజాశక్తి-నెల్లూరు :వైసిపి నగర అధ్యక్షులు తాటి వెంకటేశ్వర్లు ఆ పదవికి, పార్టీ ప్రాధమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గురువారం రూరల్ ఎంఎల్ఎ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల నుంచి తమ నాయకుడు , రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ స్పీకర్ ప్రకటించడం దారుణమన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అధికార పార్టీ నాయకులు, మంత్రుల నుంచి తమ నాయకుడికి ఎదురైన అవమానానికి తీవ్రమైన మస్తాపానికి గురై వైసిపి నగర అధ్యక్షుడి స్థానానికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన పయనం రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెంటనే ఉంటుందన్నారు.

సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

నగర సుందరీకరణ పనులు పరిశీలన

నెల్లూరు :నగర సుందరీకరణ పనులలో భాగంగా నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ ఫ్లైఓవర్ క్రింద చేపట్టిన వివిధ నిర్మాణాలను వేగవంతం చేయాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఫ్లైఓవర్ క్రింద ప్రాంతాన్ని కమిషనర్ గురువారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రధానమైన కూడలి అయిన ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో పచ్చదనం పెంపొందించేందుకు అందమైన పూల మొక్కలను నాటి, వాటిని నిరంతరం సంరక్షించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఇంజనీర్ అధికారులు అనిల్, మాధవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి -కందుకూరు : పట్టణంలోని శివారు ఓవి రోడ్డులో మాల్యాద్రి కాలనీ వద్ద ద్విచక్ర వాహనాన్ని పాఠశాల వ్యాను ఢీకొన్న సంఘటన గురువారం జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న సాయి చరణ్(30) అక్కడికక్కడే మృతి చెందాడు. కందుకూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పట్టణంలోని కోవూరు రోడ్డుకు చెందిన సాయి చరణ్ మోటారు సైకిల్ పై సింగరాయకొండ వెల్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో సాయి చరణ్ మతి చెందినట్లుగా పోలీసులు గుర్తించారు. పోలీసలు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

ప్రజాశక్తి-నెల్లూరు
రోడ్డు భద్రత సిబ్బందికి ఎస్‌పి సిహెచ్ విజయరావు రేడియం జాకెట్స్ పంపిణీ చేశారు. గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో రోడ్డు భద్రతా సిబ్బంది సంక్షేమంలో భాగంగానే రేడియం జాకెట్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో రేడియం జాకెట్స్ తప్పనిసరిగా ధరించి హైవేపై రోడ్డు ప్రమాదాలు తగ్గించాలని, ప్రజల ప్రాణాలు కాపాడుటే ప్రథమ కర్తవ్యమన్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో పెట్రోలింగ్ లో విజిబిలిటీ కోసం రోడ్డు భద్రత సిబ్బంది తప్పనిసరిగా రేడియం జాకెట్స్ ధరించి రేడియం లైట్స్, టార్చ్ లైట్ లు ఉపయోగించాలన్నారు. హెల్ప్ లైన్ ల ద్వారా అందే కాల్స్ కు స్పందించి రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారిని రక్షించాలన్నారు.

సిఐటియు నాయకులు చిన్నయ్య మృతి

పలువురు నివాళి

ప్రజాశక్తి- వెంకటాచలం
వెంకటాచలం మండల సిఐటియు అధ్యక్షులు అడపాల చిన్నయ్య గురువారం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. అయన ఎంతో కాలంగా సిపిఎం పార్టీలో పనిచేశారు. సిఐటియు మండల కార్యదర్శిగా, అధ్యక్షుడిగా సేవలందించారు. సర్వేపల్లిలోని ఆయన నివాసం వద్ద చిన్నయ్య భౌతికకాయానికి సిపిఎం నాయకులు నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గోగుల శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షురాలు రెహనా బేగం, సిపిఎం మండల కన్వీనర్ ఓడూరు వెంకట కష్ణయ్య, సిఐటియు మండల కార్యదర్శి గుండాల ఇరగాలయ్య, ముంగర చెంచురా మయ్య, ఖాజా మస్తాన్, నజీర్ భాష, తుమ్మ తాటి వెంకయ్య తదితరులు నివాళి అర్పించినారిలో ఉన్నారు.

అడపాల చిన్నయ్య (ఫైల్)

వ్యవసాయ బడ్జెట్ బూటకం..!

మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి
వ్యవసాయ శాఖను మూసేసి, మరోవైపు పచ్చి అబద్ధాలు చెబుతూ రైతుల గొంతు కోస్తున్నారని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. వైసిపి పాలనలో వ్యవసాయ అనుబంధ రంగాలకు ఖర్చు చేసిన మొత్తాన్ని పథకాల వారీగా శ్వేతపత్రం విడుదలచేసే దమ్ము మంత్రి కాకాణికి ఉందా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి బుగ్గన బుగ్గ నిండా అబద్ధాలు చెప్పారన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అంతకుమించిన అబద్ధాలతో మాటల కోటలు కట్టారన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయసాయ అనుబంధ రంగాలకు రూ.41,436 కోట్లు అని ప్రకటించారని, బడ్జెట్ సమా వేశంలో పచ్చి అబద్ధాలతో శాసనస భను తప్పుదోవ పట్టించడం వైసిపి ప్రభుత్వ మోసాలకు పరాకాష్ట అన్నారు. కొద్ది రోజుల కిందటే పిఎం కిసాన్ నిధుల జమ సంద ర్భంగా నాలుగేళ్లలో రైతులకు రూ.1.45, 754 కోట్లు ఖర్చు పెట్టామని ప్రభుత్వం ప్రకటనలు చేసిందన్నారు. కాకాణి అసెంబ్లీలో మాట్లాడుతూ రూ. 1,54,000 కోట్లు ఖర్చు పెట్టామని చెప్పారన్నారు. అందులోనూ పంటల కొనుగోలు, ఉచిత విద్యుత్ కు మాత్రమే రూ.95,000 కోట్లు ఖర్చు పెట్టినట్లు చూపుతు న్నారన్నారు. ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఎఫ్‌సిఐకు బియ్యం అమ్ముకుని కూడా దానిని రైతులకు పెట్టిన ఖర్చుగా చూపడం దురదష్టకరమన్నారు. కొత్తగా ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు, వేల కోట్లు ఖర్చుపెడుతున్నట్లు ప్రచారం చేసు కుంటున్నారని విమర్శించారు. ఖర్చును ఇటు వ్యవసాయ రంగంలో చూపుతు న్నారని, అటు విద్యుత్ శాఖ ఖర్చులోనూ చూపుతూ మాయ చేస్తున్నారని తెలిపారు. పచ్చి అవాస్తవాలతో లక్షల కోట్లు ఖర్చుపెట్టామని చెప్పడం రైతుల గొంతు కోయడమేనన్నారు. రూ.1.45 లక్షల కోట్లలోనూ నాలుగేళ్లలో మీరు ఖర్చు పెట్టింది రూ.35,700 కోట్లు మాత్రమేనని, రైతు భరోసా, ఒక్కో రైతు కుటుం బానికి రూ.7500 ఇస్తూ ఏడాదికి ఖర్చుబెడుతున్నది రూ.3900 కోట్లే.. మిగిలిన వ్యవసాయ శాఖ మొత్తం మూసేశారన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు సాయిల్ కార్డులు అందజేసి అవగాహన కల్పించినందున 20 శాతానికి పైగా పెట్టుబడి తగ్గిందని, అదే స్థాయిలో దిగుబడి పెరిగిందని అసెంబ్లీ సాక్షిగా బుగ్గన చెప్పడం హాస్యాస్పదం..

'అమరజీవి'కి ఘన నివాళి


నెల్లూరులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, కమిషనర్

పలుచోట్ల పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

ప్రజాశక్తి-నెల్లూరు : తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ఆమరణ నిరాహార దీక్షతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించిన పొట్టిశ్రీరాములు మహోన్నతుడు అని కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు పేర్కొన్నారు. గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలోని విగ్రహానికి, కలెక్టరేట్ ఆవరణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళిఅర్పించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్, నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీమతి హరిత, నుడా ఛైర్మన్ శ్రీ ముక్కాల ద్వారాకానాద్, జిల్లా పర్యాటక శాకాధికారి కనక దుర్గా భవానీ పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో..
జిల్లా వాసి "అమరజీవి" పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని ఎస్‌పి కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఎస్‌పి సిహెచ్ విజయరావు ఘన నివాళులు అర్పించారు. ఎస్‌పి మాట్లాడుతూ తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహార దీక్ష చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో...ఆంధ్రులు గతంలో మద్రాశీలుగా పిలవబడేవారని, అటువంటి పరిస్థితుల్లో తెలుగు వారికి ప్రత్యేక గుర్తింపు కావాలంటూ ఆమరణ నిరాహారదీక్ష చేసి తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరజీవి శ్రీ పొట్టిశ్రీరాములని పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ అబ్దుల్ అజీజ్ అన్నారు. గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఆయన ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్రహ్మం గుప్త, దర్శి హరి కష్ణ, రాజా నాయుడు, కంటే సాయి, జలదంకి సుధాకర్, రవి, సుబ్రహ్మణ్యం, మాదాల కొండల రావు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో...
ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని కార్పోరేషన్ కార్యాలయం శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వారి చిత్ర పటానికి కమిషనర్ హరిత పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నగర పాలక సంస్థ వివిధ విభాగాల ఉన్నతాధికారులు పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పించారు.

వెంకటాచలం: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సుందరవల్లి , విశ్వవిద్యాలయ సచివులు ఆచార్య రామచంద్ర రెడ్డి పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ విద్యానంద్ కుమార్ బాబు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అల్లం ఉదయ శంకర్ గారు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విద్యా ప్రభాకర్ ఉన్నారు.

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు పట్టణ వైసిపి కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పలువురు వైసిపి నాయకులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెల్లూరు జిల్లా బిసి సెల్ అధ్యక్షులు జాజుల కోటేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు ఎస్ కె. రఫీ, సర్పంచ్ ఆవుల మాధవరావు, జనార్ధన స్వామి, దేవాలయం ఛైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం, పబ్బిశెట్టి శివ, మురారి శెట్టి శ్రీకాంత్, చక్కా వెంకట కేశవరావు పాల్గొన్నారు.

కందుకూరులో...

టిడిపి ఆధ్వర్యంలో ..
అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతినిపట్టణ టిడిపి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. తొలుతు పార్టీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి, తరువాత పెద్ద బజారులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పార్టీ నేతలు పూలమాలవేసి నివాళులర్పించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు మోదడుగు వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా కందుకూరు పెద్ద బజారులో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలవేసి గురువారం నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పబ్బిశెట్టి శివ, ఆర్యవైశ్య నాయకులు మురారిశెట్టి శ్రీకాంత్, చక్కా వెంకట కేశవరావు ఉన్నారు.

పొదలకూరు : పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని పొదలకూరు ఆర్యవైశ్య సంఘం వారు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచి పెట్టారు. పొట్టి సుధాకర్, అమర్తలూరు చెంచయ్య ఉన్నారు. ముదిగేడు ఎస్‌సి ప్రాథమిక పాఠశాలలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు జరిగాయి. ప్రధా నోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎంఎల్ఎ కోటంరెడ్డి 'మాక్ అసెంబ్లీ'

నిరసన తెలుపుతున్న శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు :నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించాలని వైసిపి అసమ్మతి ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కెవిఆర్ పెట్రోల్ బంకు సమీపంలోని తన కార్యాలయంలో ఎంఎల్ఎ శ్రీధర్‌రెడ్డి గురువారం 'మాక్ అసెంబ్లీ' నిర్వహించారు. ఈ మాక్ అసెంబ్లీకి స్పీకర్ గా కోటంరెడ్డి అనుచరుడు షేక్ షంషుద్దీన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తొలి రోజు జరిగిన పరిణామాలను వివరించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ 2021 ఫిబ్రవరి నుంచి 2022 జులై 27వ తేదీ మధ్య కాలంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని నేరుగా కలిసి రూరల్ నియోజ కవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి లేఖలు అందజేశామన్నారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు నిధులు కేటాయించాలని కోరానన్నారు. తాను ప్రస్థావించిన సమస్యల్లో ప్రధానంగా బారాషహీద్ దర్గా అభివద్ధికి నిధులు, పొట్టేపాళెం కలుజు వద్ద వంతెన, మైనార్టీ గురుకుల పాఠశాల, అంబేద్కర్ భవన్, బిసి భవన్, కాపు భవన్ నిర్మాణ పనులు ఉన్నాయన్నారు. పనులు ప్రారం భించేందుకు నిధులు కేటాయించాలని సిఎం సంతకం చేసినా ఆర్థిక శాఖ నిధులు విడుదల చేయలేదన్నారు. ఈ సమస్యలను తిరిగి సిఎం దృష్టికి తీసుకెళ్లేందుకు అసెంబ్లీ సమావేశంలో తాను మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలని, మైక్ ఇవ్వాలని అభ్యర్థించినా స్పీకర్ అనుమతించకపోగా అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించడం దారుణమన్నారు. మాక్ అసెంబ్లీ ముగింపు సందర్భంగా స్పీకర్‌గా వ్యవహరించిన షంషుద్దీన్ ప్రజా సమస్యలను ప్రస్థావించిన ఎంఎల్ఎ కోటంరెడ్డిని అభినందిస్తూ, ప్రజా సమస్యల పట్టని ప్రభుత్వాన్ని శాశ్వతంగా సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటన చేశారు.

వ్యవసాయ బడ్జెట్‌పై ప్రశంసలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి గు రువారం ప్రవేశ పెట్టిన వ్యవ సాయ బడ్జెట్‌ను వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్ రె డ్డి ప్రశంశించారు. రైతు కుటుం బం నుంచి వచ్చిన మంత్రి గోవ ర్ధన్ రెడ్డికి రైతుల సాధక బాధ లు తెలుసు కాబట్టి బడ్జెట్ లో వ్యవసాయానికి పెద్ద పీట వేశా రన్నారు. మంత్రి గోవర్ధన్ రెడ్డి రూ. 41436 కోట్ల వ్యయంతో బడ్జెట్ ప్రవేశ పెట్టడమే అందు కు నిదర్శనమని సుధీర్ రెడ్డి చెప్పారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : అనారోగ్యాలకు గురైన పేదలకు విద్యా ఫౌండేషన్ అండగా వుంటుందని ఆ సంస్థ ప్రతినిధి శ్రీపతి రాము పేర్కొన్నారు. బ్రెయిన్ స్ట్రోక్ కు గురైన తోటపల్లిగూడూరు గ్రామానికి చెందిన ఒరుందురు హేమ కుమార్ కుటుంబ సభ్యులకు నెలసరి నిత్యావసర సరుకులు శ్రీపతి రాము గురువారం అందజేశారు. శాంతి వర్ధన్, క్రిమన్, భవానిశంకర్, పవన్, దానియేలు, సందీప్, నాని, అఖిల్ , తనయ్ పాల్గొన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు : ఆకలితో ఉన్న వారి ఆకలిని తీరుద్దాం.. వాళ్ల కళ్ళల్లో ఆనందాన్ని చూద్దాం.. అనే నినాదంతో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా గురువారం కీర్తిశేషులు ముళ్లమూరి వెంకటేశ్వర్లు తొలి వర్ధంతి సందర్భంగా నల్లమోతు సురేష్ దంపతుల సహకారంతో కందుకూరు పట్టణ వీధుల్లో ఉండే పేదలకు, నిరాశ్రయులకు మధ్యాహ్నం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయంకషి మానసిక వికలాంగుల ఆశ్రమంలో పిల్లలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘ మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు, చీదెళ్ళ కష్ణ పాల్గొన్నారు.

కెజిబివిలో జిసిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం బాలిక శిశుఅభివృద్ధి అధికారి టి.మమత ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగది, స్టోర్ రూమ్, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మధ్యాహ్నం పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తపరిచారు. 10వ తరగతి, ఇంటర్, పరీక్షల్లో నూరుశాతం సాధించాలని విద్యార్థినిలను కోరారు. అనంతరం శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలలో పాల్గొని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మమ్మ, ఉపాధ్యానిలు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

నిరూపయోగంగా బస్‌షెల్టర్

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని నందవరం క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న బస్‌షెల్టర్ పిచ్చిమొక్కలతో నిండి నిరుపయోగంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో నెల్లూరు ఎంపిగా ఉన్న మేకపాటి రాజమోహన్ రెడ్డి ఎంపి నిధులతో నందవరంక్రాస్ రోడ్డు వద్ద బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. ఉదయగిరి వెళ్లే బస్సులు ఆలస్యం అయినప్పుడు ప్రయాణికులు ఎండా, వానలకు షెల్టర్‌లో ఉండి వెళ్లేవారు. ప్రస్తుతం ఆ షెల్టర్‌లో ప్రయాణికులు ఉండేందుకు వీలు లేకుండా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి విషసర్పాలకు, అసాంఘీక కార్యకలాపాలకు నెలవుగా మారింది. దీనితో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగించే సమయంలో రోడ్లపై వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత వేసవిలో ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో ఉండే అవకాశాలు ఉన్నందున అధికారులు స్పందించి బస్సు షెల్టర్‌లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి ఉపయోగంలోకి తీసుకుని రావాలని ప్రజలు కోరారు.

759 పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి 802పొగాకు బేళ్లను రైతులు తీసుకురాగా వీటిలో 759బేళ్లను పలు కంపెనీల వ్యాపారస్తులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 16పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. వీటిలో ఎన్ఎస్ 04 ఎన్ బి 10, సి ఆర్ 02ఉన్నాయని తెలిపారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.200 కాగా కనిష్ఠ ధర రూ.191, సగటు ధర రూ.197.43 నమోదైందని తెలిపారు. ఈ వేలంలో 6మంది కంపెనీ వ్యాపారస్తులు పాల్గొన్నారని తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 10వ తరగతి విద్యార్థులకు మర్రిపాడు గ్రంథాలయ ఇన్‌ఛార్జి అధికారి నారాయణరావు తన కుమారుడు 11వ వర్ధంతి సందర్భంగా గురువారం జిసిడిఒ మమత విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ త్వరలో జరగబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రతిఒక్కరూ బాగా చదివి మంచిమార్కులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో లైబ్రరీ అధికారి నారాయణరావు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం సిబ్బంది, తపాల అధికారి ఖాజారహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా..

- పలువురికి గాయాలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

ఎఎస్‌పేట వద్ద ఉన్న నక్కల వాగులో ఓ ఆటో బోల్తాపడి పలువురు గాయపడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. హసనాపురం నుండి ఎఎస్‌పేటకు ప్యాసింజర్లతో వస్తున్న ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అదుపుతప్పి ఓ స్కూటర్‌ను ఢీకొని నక్కలవాగు డిమ్మిని కొట్టుకుంటూ వాగులో పడగా నలుగురు గాయపడ్డారు. అందులో స్కూటర్ మీద ప్రయాణించే ఇద్దరు గాయపడగా ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళ డ్రైవర్ గాయపడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పలుచోట్ల అమరజీవికి ఘన నివాళులు

ప్రజాశక్తి-అల్లూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి దద్దగుంట శిరీష శిరీష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయన్ని స్మరించుకోవడం చాలా గర్వకారణమన్నారు. నేటి యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఎంపిడిఒ శ్రీదేవి మాట్లాడుతూ అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాషా ప్రయుక్త రాష్ట్రంగా అలాగే ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ కోసం 56 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో శ్రీరామకృష్ణ, నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ ఫణికుమార్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో శ్రీ పొట్టిశ్రీరాములు జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డాక్టర్ జి.కరుణ సాగర్ మాట్లాడుతూ శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరికీ ఆయన ఆదర్శప్రాయుడని ఆనాటి ఆయన ఆమరణ నిరాహార దీక్ష ఫలితం మనకు ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని తెలిపారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థి కార్యకలాపాల కార్యనిర్వహణ అధికారి డాక్టర్ టి.గోపీకృష్ణ, అధ్యాపక, అధ్యాపకేతర, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : స్థానిక తహశీల్దారు కార్యాలయంలో శ్రీ పొట్టి శ్రీరాములు 123వ జయంతిని తహశీల్దార్ అబ్దుల్ హమీద్ తన సిబ్బందితో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ పొట్టి శ్రీరాములు ఫోటోకు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలన అనంతరం స్వాతంత్య్రం వచ్చిన తరువాత మద్రాసు ప్రాంతంలో భాగంగా ఉన్న తెలుగువారి కోసం ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించి మన తెలుగువారి కోసం ఒక ప్రత్యేక రాష్ట్రాన్ని కల్పించిన మహనీయుడని ఆయన కొనియాడారు. అంతేకాకుండా తెలుగు వారి అభివృద్ధి కోసం తెలుగువారి రక్షణ కోసం తెలుగువారి అవకాశాలను దోచుకుంటున్న పరిస్థితులను అర్థం చేసుకొని ఒక ప్రత్యేక రాష్ట్రం తెలుగువారికి ఉండాలన్న దృఢ నిశ్చయంతో నాడు ఆయన తీసుకున్న సాహసమైన నిర్ణయం వల్ల నేడు తెలుగు వారు గర్వంగా బతికే పరిస్థితులు వచ్చాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌ఒ కొండయ్య, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీను, విఆర్ఎ మల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూర్‌అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావానికి ప్రాణత్యాగం చేసిన మహానుభావుడు శ్రీ పొట్టి శ్రీరాములు అని పలువురు ఆర్యవైశ్యులు కొనియాడారు. గురువారం ఆత్మకూరు పట్టణంలో సత్రం సెంటర్ వద్ద అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 122వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎస్ఐ శివశంకర్‌రావు నివాళులర్పించారు. అనంతరం బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రావణ్ కుమార్, ఆత్మకూరు సిండికేట్ ఫార్మసీ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్ కుమార్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇందూరు రమణారెడ్డి, వైసిపి నాయకులు నోటి వినయ్‌కుమార్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘ ప్రెసిడెంట్ సుధీర్, ఆర్యవైశ్య సంఘ పెద్దలు, సంఘ సభ్యులు సురేష్ బాబు, ఇతరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఆర్‌డిఒ, ఎంపిడిఒ, మున్సిపల్ కార్యాలయాలలో శ్రీ పొట్టి శ్రీరాములు జన్మదిన వేడుకలు నిర్వహించారు.



ప్రజాశక్తి-బిట్రగుంట : అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా గురువారం తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దార్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో క్ష పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అందరూ కార్యాలయం సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. విశ్వనాథరావుపేట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గండూరి మంజుల ఆధ్వర్యంలో శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెండ్లి వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్, గ్రామ వాలంటీర్లు, అధికారులు తదితరులు ఉన్నారు. జువ్వలదిన్నె గ్రామంలో శ్రీ పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు, నూకసాని రాజ్యలక్ష్మి, శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి-సంగం : తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గురువారం శ్రీ పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులతో కలిసి వారు శ్రీ పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములకు జోహార్లు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గిరిబాబు, రాజా, వేమా మల్లికార్జున రావు, శ్రీధర్, శ్రీరామ్, అనీల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు, ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం అమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన మహనీయులు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆదేశానుసారం కావలి టిడిపి కార్యాలయంలో గురువారం జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మద్రాసుప్రెసిడెన్సీలో మనం మద్రాసీయులుగా పిలవబడే వారమనీ తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు రావాలని, 58 రోజులు ఆమరణ దీక్ష చేసి, తెలుగు వారి కోసం ప్రాణాలను అర్పిం చినమహనీయులు శ్రీ పొట్టిశ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, కావలి పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, పార్లమెంట్ ఎస్‌సిసెల్ అధ్యక్షులు కాకి ప్రసాద్, జిల్లా రైతు విభాగం ఉపాధ్యక్షులు బొట్లగుంట శ్రీహరి నాయుడు, రాష్ట్ర బిసిసెల్ అధికార ప్రతినిధి ఉప్పుటూరు బాల గురుస్వామి, పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు పోతుగంటి శ్రీకాంత్, చవల రామకష్ణ, కోట రమేష్, కటకం రాము, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు దావులూరి దేవకుమార్, పట్టణ పార్టీ ముఖ్య నాయకులు కావేటి చిన్నకోటయ్య, మంచాల ప్రసాద్, చలంచర్ల రాజా, పట్టణ మహిళా విభాగం కార్యనిర్వాహక కార్యదర్శులు కొల్లూరు అశ్విని, రాధమ్మ, కార్యదర్శులు కట్టమూరు శ్రీదేవి, సుప్రజ, పట్టణ నాయకులు గుంటుపల్లి నాగేశ్వరరావు, మక్కిన హరిబాబు, జంపాని ప్రసాద్, చవల మురళీకృష్ణ, వెలువు మోహన్, సింగమనేని హరిబాబు, నలమోతు శ్రీనివాసులు, పఠాన్ అమీర్ ఖాన్, తుమ్మల హరీష్, గొట్టిపాటి రాము, పులివర్తి రవీంద్ర, కోవూరు వెంకటనారాయణ, తలపల రమణ, బోట్ల వేణు, గంగినేని సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఎంపిడిఒ సందర్శన

ప్రజాశక్తి-ఉదయగిరి

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్

మండలంలోని తిరుమలాపురం సచివాలయంలో ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్, ఇఒపిఆర్‌డి మల్లికార్జున గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఎస్‌డిజి సర్వే సిఆర్‌ఆర్ యాప్ పురోగతిని సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయుష్మాన్‌భవ సర్వే గురించి అడిగి తెలుసుకొని త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ముఖ్యంగా పన్ను 100 శాతం పూర్తి చేసి పంచాయతీలో కరెంటు చార్జెస్ పూర్తిగా సిఎఫ్ ఎంఎస్‌లో బిల్లు జానరేట్ చేసి చెల్లింపులు చేయాలన్నారు. జెఎస్ఎస్ విధానాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌లతో వర్మీ కంపోస్ట్ తయారు చేసి పంచాయతీ కి ఆదాయం సమకూర్చాలని పంచాయతీని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లాలని కార్యదర్శికి ఆదేశించి పలు సూచనలు చేశారు. అనంతరం సచివాలయ రికార్డులు అప్‌డేట్ ఎప్పటికప్పుడు చేయాలని సూచించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాన్లు, లైట్లు వితరణ

ప్రజాశక్తి-బిట్రగుంట

స్థానిక భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రానికి గౌరవరం వాస్తవ్యులు మేదరమెట్ల శ్రీనివాసులు రెడ్డి, సతీమణి యశోద ఆదరణ కేంద్రానికి రూ.15వేలు విలువ చేసే సీలింగ్ ఫ్యాన్స్, లైట్లు, భోజనాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ సింహాద్రిరావు మాట్లాడుతూ శ్రీనువాసులు రెడ్డి గతంలో కూడ ఆదరణ కేంద్రానికి సిమెంటు, ఇటుకలు, టైల్స్ ఇచ్చారని, వారి సహాయంతో త్వరలో వంటగది నిర్మాణం చేపడతామని, ఆదరణ కేంద్రంలో లైట్లు, ఫ్యాన్లు తక్కువగా ఉన్నాయని తెలుసుకున్న శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు వాటిని వితరణగా ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేదరమెట్ల శివ ప్రతాప్ రెడ్డి, కుటుంబ సభ్యులు, తదితరులు పోల్గొన్నారు.

విద్యుత్ శాఖలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

విచారణ చేపడుతున్న అధికారులు

మండలంలోని కొత్తూరు విద్యుత్ శాఖ అధికారులపై కలెక్టర్ ఫిర్యాదు అందడంతో గురువారం విజిలెన్స్ అధికారులు ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా ఎపి టిఎస్ అండ్ విజిలెన్స్ పోలీస్ స్టేషన్ సిఐ బి.శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ కె.సాంబశివ రావు కొత్తూరు ప్రాంతంలో విచారణ చేపట్టారు. సోమవారం 13వ తేదీన కొంతమంది రైతులు నుంచి కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో విద్యుత్ శాఖలోని కుంభకోణం వెలుగులోకి వచ్చింది. విద్యుత్ శాఖలో కొత్తూరు ఏఈగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరాజుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భారీ ముడుపులు తీసుకుని రొయ్యల గుంతలకు నిబంధనలకు విరుద్ధంగా 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలతోపాటు, కొత్తూరులోని ఓ ప్రయివేటు లేఅవుట్‌కు రైతులకు మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అదేవిధంగా జగదేవిపేట కో-ఆపరేటివ్ బ్యాంక్ పక్కనే ఉన్న అతిథి గృహానికి ఏర్పాటు చేసిన విద్యుత్ సౌకర్యమే ఈ అవినీతికి పరాకాష్టగా నిలిచింది. అదేమ్మసత్రం, లేబూరు లింకు రోడ్డు, పున్నూరు, మూలపాడులకు ఎలాంటి అనుమతులు లేకుండా సర్వీసు లైన్లు తదితర పనులు చేసినట్లు తెలుస్తోంది. సదరు అధికారి వ్యవహారంపై ఇటీవల కలెక్టర్‌కు కొంతమంది రైతులు ఫిర్యాదు చేయడంతో ఈ విషయాలు బట్టబయలయ్యాయి.

విజిలెన్స్ సిఐ బి.శ్రీనివాసరెడ్డి వివరణ కోరగా.. కొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలో అవినీతి జరిగిన ప్రదేశం సందర్శించి కేసుపై విచారణ చేపట్టామని తెలిపారు. విచారణ తర్వాత అవినీతి నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటామన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

ప్రజాశక్తి-సంగం

మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంపై తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం నాయకులు, టిడిపి నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ రైతు సంఘం నాయకులు బాణా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ మండలంలో వరి కోతలు ప్రారంభమై ఇన్ని రోజులు అవుతున్న అధికారులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని మండిపడ్డారు. 17వ తేదీ నుండి 20వ తేదీ వరకు వర్షాలు ఉన్న నేపథ్యంలో ధాన్యం కల్లాల్లోనే ఉండడం వల్ల తీవ్రంగా ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. అధికారులు రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుంటే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకురాలు మంజుల, విజయకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, బాబు, వేణు, బాలు, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా జరుగుతున్న పనులు

నాసిరకంగా రోడ్డు పనులు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని విరువూరు నుండి ఇసుకపల్లి వరకు వేస్తున్న తారురోడ్డు పనులు నాసిరకంగా జరుగుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ రోడ్డుపనులు 8 కిలోమీటర్ల పరిధి కలిగి రూ.2కోట్ల 44లక్షలు వ్యయంతో జరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో వచ్చిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల కోడ్ సందర్భంగా నిలిచిపోయింది. అయితే ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత తారు రోడ్డు పనులు మళ్లీ శరవేగంగా మొదలయ్యాయి. విరువూరు నుండి ఇసుకపల్లి వరకు రోడ్డు చాలా అధ్వానంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొత్తగా రోడ్డు పనులు మొదలైన తర్వాత కొంతమంది గ్రామస్తులు రోడ్డు పనులు నాసిరకంగా ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల పోసే మార్జిన్ గ్రావెల్ విషయంలో కాంట్రాక్టర్ సరైన నిబంధనలు పాటించడం లేదని పలువురి గ్రామస్తుల ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి రోడ్డు నిర్మాణంలో ఎలాంటి అవకతవకులు లేకుండా నాణ్యమైన రోడ్డును ప్రజలకు అందించాలని వారు కోరుతున్నారు

CHANGE OF NAME

I, DEVARAPALLI SANKAR REDDY S/o Devarapalli Venka Reddy, 16-3-410, F.No.201, Manidweepam Apt, Peoples park, Haranadapuram, NELLORE-3, SPS NELLORE DIST.A.P. Have Changed My NAME from DEVARAPALLI SANKARA REDDY (OLD NAME)TO **DEVARAPALLI SANKAR REDDY**(NEW NAME). Hence forth Iam Being Called **DEVARAPALLI SANKAR REDDY**(NEW NAME) for All purpose.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

- 934 మంది గాను 905 మంది హాజరు

- 29 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : విద్యార్థి దశ కీలకమైన ఇంటర్మీడియట్ పరీక్షలు పగడ్బంధీగా నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల అనంతరం ఒక్కనిమిషం ఆలస్యమైనా పరీక్షకు హాజరుకాని అధికారులు ప్రకటించిన నేపథ్యంలో ఆయా కళాశాల సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించడంతో ఆత్మకూరు పట్టణంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 237 మంది విద్యార్థులకు గానూ 231 మంది విద్యార్థులు హాజరు కాగా 6 మంది గైర్హాజరయ్యారు. గవర్నమెంట్ హైస్కూల్‌లో 222 మంది విద్యార్థులకు గానూ 212 మంది హాజరు కాగా 10మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. షిరిడి సాయిరాం కళాశాలలో 258 మంది విద్యార్థులకు గానూ 252మంది హాజరు కాగా 6 మంది విద్యార్థులకు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 217 మంది విద్యార్థులకు గానూ 210 మంది విద్యార్థులు హాజరు కాగా ఏడు మంది గైర్హాజరైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వాసుబాబు తెలియజేశారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి పరీక్షల నిర్వహణ ప్రశాంతంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-కలిగిరి : స్థానిక ఎపి మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలో గురువారం, స్థానిక ఎస్ఐ, సిఐ సందర్శించి సూచనలు జారీ చేశారు. గురువారం మొత్తం రెండవ సంవత్సర విద్యార్థులు జనరల్ - 122 మందికి గానూ 8 మంది గైర్హాజరు కాగా - 114 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెంట్ ఏ శ్రీను తెలియజేశారు. జరగబోయే మొదటి సంవత్సరం పరీక్షకు విద్యార్థులందరూ మాస్క్ తప్పనిసరిగా ధరించి అరగంట ముందుగానే పరీక్ష హాలుకు హాజరు కావలసినదిగా డిఒ షఫీఅహ్మద్, స్పెషల్ ఆఫీసర్ ఎం.వెంకట్రావు తెలియజేశారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలకు 35 మంది విద్యార్థులు గైహాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కిరణ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఎఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండవ సంవత్సర ఇంటర్మీడియట్ విద్యార్థుల పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలకు 376 మంది విద్యార్థులకు గానూ 341 మంది హాజరయ్యారన్నారు. 35 మంది గైహాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష సెంటర్‌లో మంచినీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్స్, బెంచీలు వంటి అన్ని సౌకర్యాలతో పాట సిసి కెమరాల పర్యవేక్షణలో పకడడం బందీగా పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఇబ్బంది లు ఎదుర్కోకుండా ఎపిఎస్‌ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి అన్ని రూట్లలోని విద్యార్థులు పరీక్షా సమయానికి చేరుకునే విధంగా బస్సు సౌకర్యమం కల్పించడమైనదని విద్యార్థులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోని సకాలంలో పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని కోరారు. ఈ పరీక్షలకు డిపార్ట్మెంట్ ఆఫీసర్‌గా నరసింహారావు స్పెషల్ ఆఫీసర్‌గా చంద్రశేఖర్ పరీక్షలను నిర్వహించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహించేలా ఎస్ఐ ఎన్.ప్రభాకర్ తమ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థినికి వైద్యం

- మానవత్వం చాటుకున్న ఎస్ఐ శివశంకరరావు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో తీవ్ర జ్వరంతో స్పృహతప్పి పడిపోయిన విద్యార్థినిని పోలీసు వాహనంలో ఆసుపత్రికి తీసుకెళ్లి తన సొంత ఖర్చులతో చికిత్స చేయించి పరీక్షా కేంద్రంలో వదిలిన ఆత్మకూరు ఎస్ఐ శివ శంకర్‌రావు మానవత్వం చాటుకున్నారని పలువురు ప్రశంసిస్తున్నారు. ఆత్మకూరులోని బాలికోన్నత పాఠశాలలో తీవ్ర జ్వరంతో పరీక్ష రాస్తూ ఉన్న స్రవంతి అనే ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థిని స్పృహ తప్పి పరీక్షా కేంద్రంలో కుప్ప కూలిపోయింది. దీంతో అక్కడే విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది వెంటనే ఎస్ఐ శివశంకరరావుకు సమాచారం అందించారు. పరీక్ష కేంద్రానికి సమీపంలో ఉన్న ఆత్మకూరు ఎస్ఐ శివశంకరరావు హుటాహుటిన పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్నారు. స్పృహ కోల్పోయిన విద్యార్థిని అక్కడే ఉన్న పాఠశాల సిబ్బందితో కలిసి తమ పోలీసు వాహనంలోనే దగ్గరిలోని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించి తిరిగి పరీక్షా కేంద్రంలో వదిలి ఎస్ఐ మానవత్వాన్ని చాటుకున్నారు. దీంతో పరీక్ష కేంద్రంలోని ఉపాధ్యాయులు, విషయం తెలుసుకోని పరీక్ష కేంద్రం వద్దకు వచ్చిన విద్యార్థిని తల్లి రవణమ్మ ఎస్ఐకు ధన్యవాదాలు తెలిపారు.. విషయం తెలిసి పరీక్ష కేంద్రం వద్దకు చేరుకొని విద్యార్థిని పరీక్షించిన అర్బన్ వైద్యశాల వైద్యురాలు సల్మా. పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఏవైనా ఇబ్బంది కలిగిస్తే వెంటనే సమాచారం ఇవ్వాల్సిందిగా అక్కడే ఉన్న పోలీస్ సిబ్బందికి ఎస్ఐ సూచించారు.

ఇంటర్ పరీక్షల్లో విద్యార్థిని డిబార్

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినిని గురువారం అధికారులు డిబార్ చేశారు. అదే కళాశాల విద్యార్థిని ఎంపిసి ద్వితీయ సంవత్సరం మొదటి రోజు సంస్కృతం పేపర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు గర్తించి విద్యార్థిని ఈ ఏడాది పరీక్షలు రాయకుండా చర్యలు తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 223మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 219మంది హాజరుకాగా నలుగురు గైర్హాజరయ్యారు. **ప్రజాశక్తి-సంగం** : బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు అర్ధగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకుని గదుల నంబర్లు చూసుకుని, పరీక్షా కేంద్రంలోకి వెళ్లారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకుండా పోలీసులు తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. పరీక్షా కేంద్రంలో 280 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

CUB **సిటీ యూనియన్ బ్యాంకు**
వేదాయపాళెం, నెల్లూరు ఫోన్ నెం : 7305049126

బంగారు నగల వేలము ప్రకటన

ఈ క్రింది ఉదహరించిన ఖాతాదారులు తమ బంగారు ఆభరణములు హామీ పై తీసుకొనిన అప్పును తిరిగి చెల్లించమని రిజిస్టర్డు డిమాండ్ నోటీసు, రిజిష్టర్లు కాషన్ అండ్ డిఫాల్ట్ నోటీసు మరియు (రిజిష్టరు వేలం నోటీసుల ద్వారా తెలియపరచిన దర్మిలా సదరు అప్పును తీర్చనందున సదరు ఆభరణములు వస్తువులు అవి **"ఉన్నవి ఉన్నట్లుగా"** ప్రాతి పదికన, బ్యాంక్ నిబంధనల ప్రకారం **తేది: 27-03-2023 ఉదయం 11 గంగలకు** మా బ్రాంచి ఆవరణములో బహిరంగ వేలము వేయబడును. ఈ నోటీసు ఖాతాదారుడు మరణించిన యెడల వారి వారసులకు ఈ క్రింది ప్రకటన పూర్వకంగా తెలియజేయడమైనదిగా భావించవలెను.

ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుటకుగాని,వేలం వాయిదా వేయుటకు గాని, రద్దు చేయుటకుగాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. హెచ్చు పాటదారుడు మొత్తం పాట సొమ్మును అదే రోజు చెల్లించి వస్తువులను పొందవలెను. లేని యెడల ధరావత్తు కోల్పోవుదురు. వేలము ద్వారా లభించిన డబ్బులను మీ యొక్క ఖాతాలో జమపరచడం జరుగుతుంది. ఇందలి ఖాతాదారునికి మా బ్యాంకులో మిగతా అప్పులు ఏవైనా ఉన్నచో పై బాకీ పోగా మిగిలిన సొమ్మును ఆ ఖాతాకు సర్దుబాటు చేయబడును.

వ.నెం	లోన్ ఖాతా నెం.	లోన్ తేదీ	ఖాతాదారుని పేరు & చిరునామా	బరువు గ్రా॥లో
1.	502112022808433	12-1-2021	కాళహస్తి గోపి, డోర్ నెం.7-267 చాణిక్యపురి, కొత్తూరు.	15.00
2.	502112153001735	28-2-2022	షేక్.ఫిరోజ్, డోర్ నెం.23-3-997 టీచర్స్ కాలనీ, ఎ.కె.నగర్, నెల్లూరు.	37.00

స్థలం : నెల్లూరు
తేది : 17-03-2023
సం/- బ్రాంచి మేనేజర్
సిటీ యూనియన్ బ్యాంకు లిమిటెడ్, వేదాయపాళెం, నెల్లూరు

CHIEF COURT
BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT CHENNAI

MCOP. No. 2423 OF 2020

1. Syed Rameeza
2. Syed Pakir Saheb ... **Petitioners**

VS

1. Shaik Rasul ... **1st Respondent**
2. IFFCO TOKIO General Insurance, Co, Ltd ... **2nd Respondent**
3. Sri Padmavathi Travels, Rep by Bommi Subbarathnama (Impleaded as per order made in M.p.No 1 of 2022) ... **3rd Respondent**

To

Sri Padmavathi Travels, Rep by Bommi Subbarathnama, 6th Ward, Mathammagudi Street, Arundhathiwada, Atmakur Village, Nellore Dt, Andhrapradesh, PIN-524322. ... **3rd Respondent**

Take notice, That the above case is posted to 28.3.2023 at 10.30am before the Hon'ble Chief Judge of Motor Accident Claims Tribunal, Chennai-104 for your appearance either in person or through pleader without Fail or otherwise the matter will be decided in your absence.

L.MOHAN RAO,
ADVOCATE, CHENNAI.
Cell: 9841235951